క్లుప్తంగా

'బండి'కి మంత్రి పదవిపై దుబాయిలో సంబరాలు



దుబాయిలో బీజేపీ నాయకుల సంబరాలు

మల్లాపూర్: కేంద్రమంత్రిగా బండి సంజయ్ పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఆదివారం బీజేపీ యూఏఈ నాయకుడు పెనుకుల అశోక్ ఆధ్వర్యంలో దుబాయిలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కార్యకర్త నుంచి కేంద్రమంత్రి పదవి చేపట్టిన బండి సంజయ్ స్వయంకృషితో ఎదిగిన నేత అని కొనియాడారు. గల్ఫ్ కార్మికులకు అండగా నిలిచే నాయకుడన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ నాయకులు సంగేశ్వర్, గంగాధర్, మణికంఠ, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్‌లో బీజేపీ నాయకులు..



కథలాపూర్‌లో నాయకుల సంబరాలు

కథలాపూర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు కేంద్రమంత్రి పదవి రావడంతో కథలాపూర్ మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ వద్ద టపాసులు కాల్చి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, బద్రి సత్యం, మల్యాల మారుతి, గాండ్ల స్వామి, మహేశ్, ప్రవీణ్‌గౌడ్, జిల్లా సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారం



ప్రతిభా పురస్కారాలతో విద్యార్థులు

జగిత్యాలటౌన్: 2024 విద్యాసంవత్సరంలో వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసినట్లు విశ్వబ్రాహ్మణ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (వెవా) జిల్లా అధ్యక్షుడు తొగిటి గంగాధర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వీకేబీ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీతో పాటు ఎంబీబీఎస్ లాంటి కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి అగ్రస్థానంలో నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు హాజరయ్యారు.

బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ



గీత కార్మికుడిని పరామర్శిస్తున్న చల్మెడ

మేడిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పలువరు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు ఆదివారం పరామర్శించారు. మేడిపల్లిలో తాడిచెట్టుపై నుంచి పడి గాయపడ్డ గీత కార్మికుడు అంజయ్యగౌడ్‌ను పరామర్శించారు. భీమారం మండలంలోని ఈదుల లింగంపేటలో గోపు సాయిరెడ్డి, వెంకట్రావుపేటలో కొంక గంగనర్సయ్య, పోతరాజు రాజేశం,చిట్యాల సాగర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్, రావు శ్రీనివాస్ రావు, అజిత్ రావు, క్యాతం సత్తిరెడ్డి, ఆదిరెడ్డి ఉన్నారు.

ప్రజావాణికి అందరూ హాజరు కావాలి

ఇబ్రహీంపట్నం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ముగియడంతో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నట్లు ఆయా శాఖల అధికారులందరూ హాజరు కావాలని పేర్కొన్నారు.

నిధులున్నా పనులు సున్నా

- అద్దె భవనాల్లో హెల్త్ సబ్‌సెంటర్లు
- భవనాల నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరు
- పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లు



అమ్మక్కపేటలో హెల్త్ సబ్‌సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది హెల్త్ సబ్ సెంటర్ల భవన నిర్మాణాల పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏర్పాటు చేసిన హెల్త్ సబ్‌సెంటర్లకు సొంత భవనాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీటి కోసం నిధులు విడుదలైనా కాంట్రాక్టర్లు ఇప్పటి వరకూ పనులు ప్రారంభించ లేదు. ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ పరిధిలో ఇబ్రహీంపట్నంలో 2, అమ్మక్కపేట, ఎర్దండి, డబ్బా ,గోధూర్, వర్షకొండ, తిమ్మాపూర్ గ్రామాల్లో హెల్త్ సబ్‌సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సబ్‌సెంటర్లకు సొంత భవనాలు లేక అద్దెభవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. ఒకొక్క హెల్త్ సబ్‌సెంటర్లలో ఇద్దరు ఏఎన్ఎంలు, నలుగురు ఆశ వర్కర్లను ఏర్పాటు చేశారు. హెల్త్ సబ్‌సెంటర్లలో నిత్యం రోగులు ఆరోగ్యకేంద్రానికి వెళ్లకుండా ఉండేందుకు సబ్‌సెంటర్ల వద్దే వైద్యం, మందులు అందజేస్తున్నారు. ప్రతి బుధవారం, శనివారం చిన్నపిల్లలకు ఈ సెంటర్ల ద్వారా వ్యాక్సిన్లను ఇస్తున్నారు. ఒకొక్క హెల్త్ సబ్‌సెంటర్‌కు నెలకు రూ. 1200 నుంచి రూ. 1500 అద్దె చెల్లిస్తున్నారు. అరకొర వసతుల మధ్య ఉన్న హెల్త్ సబ్‌సెంటర్లలో నిత్యం వైద్య సిబ్బంది రోగులకు సేవలు అందించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అద్దె చెల్లించకపోవడంతో యజమానులు భవనాలు ఖాళీ చేయమని చెబుతున్నారు. దీంతో మరోక భవనాన్ని వెతుక్కోవాల్సి పరిస్థితి ఉంది. 8 నెలల క్రితం మండలంలోని అమ్మక్కపేటలో అప్పటి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు సంబంధిత కాంట్రాక్టర్ పనులను ప్రారంభించలేదు. అధికారులు చొరవ చూపి వెంటనే హెల్త్ సెంటర్ల భవన నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని 8 హెల్త్ సబ్‌సెంటర్ల భవన నిర్మాణాలకు రూ. 1.60కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ భవనాల నిర్మాణానికి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదు. మండలంలోని వర్షకొండలో నిర్మాణ దశలో ఉంది.



అద్దె భవనంలో ఇబ్రహీంపట్నం హెల్త్ సబ్‌సెంటర్

నోటీసులు ఇచ్చాం



పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చాం. వెంటనే పనులు ప్రారంభించకపోతే మళ్లీ నోటీసులు అందచేసి, టెండర్లు రద్దు చేస్తాం. పనులు ప్రారంభించి తొందరగా పూర్తి చేయించేందుకు కృషి చేస్తాం.

జీఏ అన్వర్, పీఆర్, డీఈఈ, మెట్‌పల్లి

'గంగనాల' గేట్లకు మరమ్మతు



గేట్లకు మరమ్మతు చేయిస్తున్న వీడీసీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: గంగనాల ప్రాజెక్టు గేట్లకు తుప్పు పట్టి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఎన్నో సార్లు నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులే మరమ్మతులకు ముందుకు వచ్చారు. మండలంలోని వేములకుర్తి శివారులోని గోదావరి నదిపై నిర్మించిన గంగనాల ప్రాజెక్టు ద్వారా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్, మల్లాపూర్ మండలంలోని నడికుట, మొగిలిపేట, ఓబులాపూర్, సంగెం శ్రీరాంపూర్, దామ్‌రాజ్‌పల్లి గ్రామాల్లోని సుమారు 4 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ ప్రాజెక్టుగేట్లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరడంతో రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది వర్షాకాలం, యాసంగి పంటలకు ఈ ప్రాజెక్టు ద్వారా నీళ్లు అందించేందుకు గాను తుప్పు పట్టిన గేట్లను వేములకుర్తి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ముందుకు వచ్చి మరమ్మతులు చేయించారు. దీంతో 2 పంటలకు నీళ్లు అందుతాయని ఆయకట్టు రైతులు తెలిపారు.

సేవా దృక్పథంతోనే కంటి ఆపరేషన్లు



వృద్ధుడి కంటిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: సేవా దృక్పథంతోనే నిరుపేదలకు ఏళ్లుగా కంటి ఆపరేషన్లు చేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నిరుపేద వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. ఎవరైనా పేదవారు నేరుగా వచ్చి ఆపరేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నాను. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సారంగాపూర్: మండలంలోని బట్టపల్లి–పోతారం గ్రామానికి చెందిన వంగపల్లి మురళీధర్‌రావు ఇటీవల గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ జోగినపల్లి సుధాకర్‌రావు, నాయకులు ఉన్నారు.

మార్కెట్ పదవులపై నాయకుల నజర్

- గత రిజర్వేషన్లే పరిగణనలోకి తీసుకుంటున్న ప్రభుత్వం
- చైర్మన్ పదవి జనరల్ కావడంతో పోటీ తీవ్రం



మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

మెట్‌పల్లి: ఎన్నికల కోడ్ ముగియడంతో నియోజకవర్గాల నుంచి మొదలుకుని రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. దీంతో ఆ పోస్టులను దక్కించుకోవడానికి నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మెట్‌పల్లిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్ పదవులు ఉన్నాయి. వీటిని గత ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారమే ప్రస్తుత ప్రభుత్వం భర్తీ చేయనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు... వాటిని దక్కించుకోవడానికి పార్టీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

జనరల్‌కు చైర్మన్ పదవి ...

బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్ కమిటీలకు సంబంధించిన చైర్మన్ పదవుల్లో అన్ని వర్గాలకు స్థానం కల్పించాలని రిజర్వేషన్ల విధానం ప్రవేశపెట్టింది. ఏడాది కాల పరిమితితో పాలకవర్గాలు కొనసాగేలా నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా మెట్‌పల్లి మార్కెట్ చైర్మన్ గిరిని మొదటగా ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. ఆ సమయంలో ఈ పదవికి బాల్క సురేశ్‌ను ఎంపిక చేశారు. ఆ తర్వాత ఎస్టీ మహిళకు రిజర్వ్ చేయగా, జరుపుల భారతిని నియమించారు. మూడో దఫా జనరల్‌కు కేటాయించారు. ప్రస్తుతం దీని ప్రకారం చైర్మన్‌ను నియమించడానికి కాంగ్రెస్ పార్టీ పెద్దలు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

పలువురు నాయకులు పోటీ...

చైర్మన్ పదవీని దక్కించుకోవడానికి కాంగ్రెస్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరిలో అంజిరెడ్డి గతంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌గా, కొంత కాలం ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన మరోసారి చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే మహేందర్‌రెడ్డి జెడ్పీటీసీ, లింగం మున్సిపల్ చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. వాటికి తమను పరిగణనలోకి తీసుకోని పక్షంలో చైర్మన్ పదవి ఇవ్వాలని ఆ ఇరువురు నేతలు పట్టుబడుతున్నట్లు సమాచారం. అలాగే డైరెక్టర్ల పదవులను పెద్ద సంఖ్యలో ద్వితీయ శ్రేణి నాయకులు ఆశిస్తుండడంతో పాలకవర్గం ఎంపిక ప్రక్రియ పార్టీ పెద్దలకు తలనొప్పిగా మారే అవకాశాలున్నాయి.

శివభక్త మార్కండేయ పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా రమేశ్



రుద్ర రమేశ్, రాజ్‌కుమార్

మల్లాపూర్: శివ భక్త మార్కెండేయ పద్మశాలీ సంఘం మల్లాపూర్ అధ్యక్షుడిగా రుద్ర రమేష్, ఉపాధ్యక్షుడిగా సాంబారి ప్రశాంత్, కోశాధికారిగా రుద్ర రాజ్‌కుమార్, దేవాలయ కమిటీ సభ్యుడిగా తోట రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన అధ్యక్షుడు రుద్ర రమేశ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, రాబోయే రోజుల్లో సంఘాన్ని ఏక తాటిపైకి నడిపిస్తూ పద్మశాలీలను బలోపేతం చేస్తానన్నారు. సమావేశంలో మాజీ అధ్యక్షుడు రుద్ర లక్ష్మీరాజం, ఆలయ కమిటీ మాజీ సభ్యుడు గుజ్జేటి నర్సయ్యతో సహా 40 మంది సభ్యులు పాల్గొన్నారు.

బీడీ టేకేదార్ మండల కార్యవర్గం

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం మండల బీడీ టేక్‌దార్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీ టేకుదార్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపెల్లి దివాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సిరిపురం భూమేశ్వర్, ఉపాధ్యక్షుడిగా జిందం సత్యనారాయణ, కోశాధికారిగా సిరిపురం ఆనంద్, ప్రధాన కార్యదర్శులుగా సిరిపురం రాజేశ్, ఎలిశెట్టి లింగేశ్వర్, ప్రచార కార్యదర్శిగా సంకె వివేక్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ బీడీ టేకుదార్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీడీ టేకుదార్లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనాలు



రామభద్రునిపల్లిలో నిరుపయోగంగా పాఠశాల భవనం

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల భవనాలు నిరుపయోగంగా ఉంటున్నాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అప్పట్లో రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు విద్యార్థులు లేక వృథాగా ఉంటున్నాయి. విద్యార్థులు లేక ఉప్పుపల్లె, రామభద్రునిపల్లి, నామాపూర్‌లోని గొల్లపల్లె, ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో ఈ భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, పాఠశాల భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఏ ఇతర అవసరాలకు వినియోగిస్తే భద్రంగా ఉంటాయని ప్రజలు సూచిస్తున్నారు. స్వశక్తి సంఘాల సమావేశాల నిర్వహణ, అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల నిర్వహణ, లేదా ఇతర ప్రభుత్వ కార్యాకలాపాలకు వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెగడపల్లి:మండలంలోని మద్దులపల్లిలో ఆదివారం విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన ముంజ తిరుపతిగౌడ్ అనే రైతుకు చెందిన పాడిగేదె ఉదయం మేతకు వెళ్లగా, గ్రామ శివారులో ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా ఎర్త్‌వైర్‌కు తాకి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. కాగా మృతి చెందిన గేదె విలువ రూ. 70 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

14 న ఆలయ వార్షికోత్సవం

కోరుట్లటౌన్: పట్టణంలోని మురళీకృష్ణాలయ వార్షికోత్సవం ఈ నెల 14న నిర్వహిస్తున్నట్లు సుందర సత్సంగ్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావును కలిసి వేడుకలకు రావాలని ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి దామోదర్, రుద్ర సుధాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

ధర్మపురి: ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో ధర్మపురిలో బీజేపీ నాయకులు నంది కూడలి వద్ద పెద్ద ఎత్తున టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీతోనే దేశాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు లవన్‌కుమార్, బండారు లక్ష్మణ్, పిల్లి శ్రీనివాస్, రాజేశ్వర్ తదితరులున్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిన నాయకులు



ఆత్మీయ సమ్మేళనంలో మేడిపల్లి యువకులు

మేడిపల్లి: జిల్లా స్థాయి మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువకులు తరలివెళ్లారు. రానున్న రోజుల్లో మున్నూరుకాపు రాజ్యాధికారం దిశగా సాగాలని వేములవాడ ఎమ్మెల్యే ఆదిశ్రీనివాస్ కోరారు. మున్నూరుకాపు కార్పొరేషన్ సాధించుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. . కార్యక్రమంలో మండల యువత అధ్యక్షుడు తొగరి లక్ష్మిపతి, చంద రమేశ్, పుప్పాల రాంరెడ్డి, సాయిని గంగారెడ్డి, చెక్కపల్లి సంజీవ్, బొమ్మెన ప్రశాంత్ పాల్గొన్నారు.

గాయత్రి బ్యాంక్‌లో వైఎల్ఎన్ఎస్ విలీనం

జగిత్యాల: తెలంగాణలోని యాదగిరి లక్ష్మీనృసింహ స్వామి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (వైఎల్ఎన్ఎస్)లోని జగిత్యాలోని గాయత్రి అర్బన్ బ్యాంక్‌లో విలీనం చేయడానికి రిజర్వ్‌బ్యాంక్ అనుమతిచ్చిందని గాయత్రి బ్యాంక్ సీఈవో వనమాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎల్ఎన్ఎస్ ఆరు బ్రాంచీలను విలీనం చేస్తున్నామని చెప్పారు. విలీనం అవుతున్న బ్యాంక్‌లో 23 వేల ఖాతాదారులు ఉన్నారన్నారు.సమావేశంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పోరాటంలో ఎస్టీయూ ముందంజ



జెండా ఆవిష్కరిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్య పోరాటంలో ఎస్టీయూ ఎప్పుడు ముందంజలో ఉంటుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ అన్నారు. ఆదివారం ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జగిత్యాలలో జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్టీయూ సంఘం విద్యారంగ పురోగతికి కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మేకల ప్రవీణ్, రామకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత తొంబరావుపేట



విజేత టీంకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

మేడిపల్లి: మండలంలోని కట్లకుంటలో నిర్వహించిన ఆది శ్రీనన్న క్రికెట్ టోర్నమెంట్‌లో తొంబరావుపేట జట్టు గెలుపొందింది. మేడిపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం జలంధర్ రెడ్డి బహుమతులు అందజేశారు. విన్నర్ టీంకు కప్, రూ.10 వేల నగదు, రన్నర్ టీంకు కప్, రూ.5 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, ఉమ్మడి మేడిపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరసింహా రెడ్డి, చేపూరి నాగరాజు, మాధం వినోద్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మార్గం నర్సరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో 2000-01లో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. తాము చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను గుర్తుచేసుకుని, ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడుతూ పాడుతూ సంబరాల్లో మునిగితేలారు. ఒకరికొకరు ఆటోగ్రాఫ్ తీసుకున్నారు. సాయంత్రం వేళ సామూహికంగా భోజనాలు చేసి సమావేశం ముగించేశారు.



ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు

కథలాపూర్: మండలంలోని సిరికొండలో ఆదివారం పెద్దమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. బోనాలతో భక్తులు ఊరేగింపుగా ఆలయం వరకు చేరుకుని, దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో దప్పుల చప్పుళ్లు, ద్యావతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

పైప్‌లైన్ లీకేజీ.. వృథాగా నీరు



భగీరథ పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. అమ్మక్కపేట రహదారిలో రైల్వే లైన్‌కు కొద్దిదూరంలో పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతోంది. గత కొద్ది రోజుల నుంచి నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. లీకేజీకి మరమ్మతు చేపట్టి నీటి వృథా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.